సాక్షి వైఎస్ఆర్ జిల్లా

గురువారం ౹ 10 ౹ అక్టోబర్ ౹ 2024



అనుచిత వ్యాఖ్యలు తగవు

సచివాలయ ఉద్యోగులపై విజయనగరం కమిషనర్ నల్లనయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆ ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. -10లో



డిగ్రీ చదివి.. దొంగగా మారి

డిగ్రీ వరకు చదివిన ఓ యువకుడు వ్యసనాలకు బానిసై దొంగగా మారాడు. చివరకు పోలీసుల చేతికి చిక్కి కటకటాల పాలయ్యాడు. -10లో

గరిష్టం/కనిష్టం 34.5/24.9

వాతావరణం

జిల్లాలో సోమవారం 24.9 - 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

‘టెట్’కు 306 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 306 మంది గైర్హాజరైనట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరులో కలిపి 8 కేంద్రాలలో ఉదయం, సాయంత్రం నిర్వహించిన ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు- 2024కు 1834 మందికి గాను 1528 మంది హాజరు కాగా 306 మంది గైర్హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని వివరించారు.

మద్యం షాపుల దరఖాస్తుల గడువు పెంపు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో 139 మద్యం షాపుల దరఖాస్తుల గడువును పెంచినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 9కి మద్య షాపుల దరఖాస్తుల గడువు తీరనున్న విషయం తెలిసిందే. అయితే గడువు పెంచాలని, దసరా సెలవుల్లో బ్యాంకులు పని చేయని నేపథ్యంలో ప్రభుత్వానికి దరఖాస్తుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 12,13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 14న జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో మద్యం షాపుల లాటరీ, అదే రోజు షాపులు కేటాయిస్తామన్నారు. 16వ తేదీ నుంచి మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

డీఎస్సీ శిక్షణ సంస్థలకు ఆహ్వానం

కడప రూరల్: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వడానికి శిక్షణ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణా సంస్థలు, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. శిక్షణ సంస్థలు కనీసం గత రెండేళ్లు డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లకు కోచింగ్ ఇచ్చి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అర్హత కలిగిన శిక్షణా సంస్థలు ఇతర వివరాల కోసం ఏపీ ఈ-పి ఆర్ ఓసియు ఆర్ఇఎంఈ ఎస్టీ పోర్టల్‌ను చూడవచ్చని తెలిపారు. తమ దరఖాస్తులను ఈనెల 21లోపు పంపాలని వివరించారు.

పాపాఘ్నికి నీటి విడుదల

వీరపునాయునిపల్లి: మండలంలోని పాపాఘ్ని నదికి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి బుధవారం కృష్ణా జలాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలేరు నగరి సుజల స్రవంతి ప్రధాన కాలువ నుంచి అడవిచెర్లోపల్లె వద్ద వాగులోకి వదలడం జరిగిందన్నారు. ఈ నీరు బుసిరెడ్డిపల్లె, పోచంరెడ్డిపల్లె, వీరపునాయునిపల్లె, అనిమెల మీదుగా పాపాఘ్నినదిలోకి చేరుతుందని తెలియజేశారు. వాగు ద్వారా నీటిని విడుదల చేయడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, దీంతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎస్ఎస్ అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం నుంచి పెన్నాకు..

జమ్మలమడుగు: మైలవరం జలాశయం నుంచి పెన్నా నదిలోకి నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైలవరం జలాశయం ఒక గేటు ద్వారా మొదట 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. క్రమేణ 2500 క్యూసెక్కులకు పెంచడం జరుగుతుందన్నారు. కావున పెన్నా పరీవాహక ప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లకుండా ఉండాలని సూచించారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వలంటీర్స్ అసోసియేషన్, సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన

బద్వేలు అర్బన్: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లను కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయ కుమార్ పేర్కొన్నారు. వలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ బుధవారం గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. చిన్ని, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేంద్రబాబు, వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌రఫీ, నియోజకవర్గ ఇన్‌చార్జి సాదిక్, నాయకులు మహేంద్ర, సురేష్, కవిత, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ పాల్గొన్నారు.



- ఎనలేని కృషి ఫలితంగానే జిల్లాకు ఆయన నామధేయం
- అప్పటి రోశయ్య సర్కారు గెజిట్ ఉత్తర్వులు జారీ
- వైఎస్సార్ పేరు రూపుమాపేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర
- మండిపడుతున్న జిల్లా వాసులు

సాక్షి ప్రతినిధి, కడప: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జనరంజక పాలన చేసి.. ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన పేరును వైఎస్సార్ జిల్లా నుంచి వేరు చేసేందుకు కూటమి ప్రభుత్వ నేతలు కుట్రలు పన్నుతున్నారు. కడప నగరం ప్రాశస్త్యం దెబ్బతింటుందంటూ కొత్త రాగం అందుకుని జిల్లా పేరు మార్చాలంటూ ముఖ్యమంత్రికి వినతిపత్రం కూడా సమర్పించడం కుతంత్రంలో భాగమేనని వైఎస్సార్ అభిమానులు పేర్కొంటున్నారు. ఒక పథకం ప్రకారమే ఆయన పేరును తొలగించేందుకు పావులు కదుపుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

14 ఏళ్ల తర్వాత..

ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రెండు తెలుగు రాష్ట్రాలపై తిరుగులేని ముద్ర వేశారు. ఆయన మరణానంతరం గౌరవార్థం ఆయన పుట్టిన జిల్లాకు వైఎస్సార్ జిల్లా అని నామకరణం చేశారు. 2010లో అప్పటి సీఎం రోశయ్య ప్రభుత్వం అన్ని వర్గాల అభిప్రాయాలతో ఈ మేరకు గెజిట్ జారీ చేశారు. ఆనాటి నుంచి వైఎస్సార్ జిల్లాగా కొనసాగుతోంది. కొత్తగా కొలువు దీరిన కూటమి ప్రభుత్వం 14 ఏళ్ల తర్వాత ఆయన పేరును మార్చేందుకు కుట్రలకు తెరలేపింది. జిల్లా పేరును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు మార్చారంటూ సాక్షాత్తు మంత్రి స్థానంలో ఉన్న సత్యకుమార్ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. కళ్ల ముందు జీవోలు, గెజిట్లు కనిపిస్తున్నా అబద్ధాలను వల్లె వేస్తూ, కడప ప్రాశస్త్యం పేరుతో ఈ కుట్రకు తెరలేపారు.

రాయలసీమకు అభినవ కాటన్‌దొర



ఎంతో మంది సీఎంలు రాయలసీమ నుంచి వచ్చినా... ప్రాంత అభివృద్ధికి బాటలు వేసింది మాత్రం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డే. చంద్రబాబు రాయలసీమ వ్యక్తే.. అయినా ఆయన సీమకు చేసిందేమీ లేదు. రాయలసీమకు జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ పథకాలను ఆనాటి సీఎం ఎన్టీ రామారావు రూపకల్పన చేస్తే, ఆ పథకాలను కార్యరూపంలోకి తెచ్చింది డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. రాయలసీమలో కృష్ణాజలాలు పారుతున్నాయంటే అదీ ఆయన చలువే. ఒక్కమాటలో చెప్పాలంటే సీమకు ఆయన అభినవ కాటన్‌దొరగా వర్ణించాలని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. అందుకే వైఎస్సార్ పేరు ఈ జిల్లాకు ఉండటం సముచితమని, మార్చాలనే ప్రయత్నం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని వైఎస్సార్ అభిమానులు పేర్కొంటున్నారు.

రాజన్న పేరు కనుమరుగు చేయాలనే..

ఎలాగైనా వైఎస్సార్ పేరును కనుమరుగు చేయాలనే తలంపుతో కూటమి నేతలు చేస్తున్న ప్రయత్నాలు జిల్లా వాసులను విస్మయానికి గురి చేస్తున్నాయి. 2010లో పేరు మార్చేటప్పుడు అభిప్రాయ సేకరణ చేపట్టారు. మెజార్టీ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతే జిల్లా పేరును మారుస్తున్నట్లు గెజిట్ చేశారు. దాన్ని తీసుకొచ్చి గత ప్రభుత్వంలో జిల్లాల విభజనలో కొత్తగా వైఎస్సార్ జిల్లా పేరు మార్చినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఇదంతా చంద్రబాబు స్కెచ్‌లో భాగంగానే కడప ప్రాశస్త్యం, దేవుని కడప దేవాలయం అంటూ మతాన్ని ముందుకు తెచ్చి.. బీజేపీ వారితో ఇలాంటి ప్రతిపాదనలు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రాశస్త్యానికి ఎలాంటి లోటు లేదు..

వాస్తవానికి కడప నగరం పేరు అలానే ఉంది. ఆ నగరం ప్రాశస్త్యం ఏ మాత్రం తగ్గలేదు. కడపలోని దేవునికడప చరిత్రతోపాటు, పెదదర్గా భిన్నత్వంలో ఏకత్వంగా మతసామరస్యానికి ప్రతీకగా ఉన్న ప్రాశస్త్యమూ తగ్గలేదు. జిల్లా పేరును, నగరం పేరుకు ముడిపెడుతూ కూటమి ప్రభుత్వం.. ముఖ్యంగా బీజేపీ నేతలు మతాన్ని అడ్డుపెట్టుకుని కొత్త డిమాండ్ తెరమీదకు తెచ్చారు. మంత్రి సత్యకుమార్ ఏకంగా సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తే... మరో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేరు మార్చేందుకు పోరాటం చేస్తామంటూ మాట్లాడుతున్నారు. ఎక్కడో ధర్మవరం ఎమ్మెల్యేగా ఉన్న సత్యకుమార్‌కు వైఎస్సార్ జిల్లా గురించి ఏం పని అని ఇక్కడి నేతలు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు 2010లో వైఎస్సార్ పేరును జిల్లాకు పెట్టేటప్పుడు ఆదినారాయణరెడ్డి కూడా ఆ నిర్ణయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా భాగస్వామ్యుడు. ఆయన సోదరుడు ఎమ్మెల్సీ హోదాలో నారాయణరెడ్డి కూడా వైఎస్సార్ పేరు పెట్టాలని ఆనాడు డిమాండ్ చేశారు. ఇప్పుడు మాట మార్చి వైఎస్సార్ పేరు మార్చాలంటూ రెండు నాల్కల ధోరణికి పరాకాష్టగా వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

జిల్లాకే గర్వకారణం



కడప జిల్లా ఖ్యాతిని పెంచిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును జిల్లాకు పెట్టడంపై జిల్లా వాసులందరూ సమ్మతించారు. ఎంతో గర్వంగా భావించారు. కానీ నేడు జిల్లాకు ఆ పేరును రాజకీయ కోసం తీసేయాలని భావించడం దారుణం. వైఎస్సార్‌పై వ్యక్తిగత కక్ష కూటమి నేతలకు ఉంటే వేరేలా తీర్చుకోవచ్చు గానీ, ఇలా జిల్లా వాసులను అవమాన పరిచేలా చేయడం మంచిది కాదు.

– రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు

రాజన్న సేవలు ప్రజల గుండెల్లో..



ప్రజలకు గుర్తుండిపోయేలా జిల్లా అభివృద్ధిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చేసి చూపించారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేశారు. సాగునీటి ప్రాజెక్టులు, రిమ్స్, నూతన కలెక్టర్ కార్యాలయ భవనాలు, యోగివేమన యూనివర్సిటీ తదితరాలు నిర్మించారు. జిల్లాకు దశదిశలా గుర్తింపు తెచ్చారు. ఆయన పేరు తొలగించే చర్యలకు కూటమి ప్రభుత్వం దిగి ప్రజల్లో అభాసుపాలు కావద్దని చెబుతున్నాను.

– రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కడప రీజినల్ ఆర్టీసీ మాజీ అధ్యక్షుడు

చిరస్మరణీయుడు



ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని అభిమానించని వారు ఉండరు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో వినూత్న పథకాలను తెలుగు ప్రజలకు అందించిన చిరస్మరణీయుడు. అటువంటి వ్యక్తికి జన్మనిచ్చిన ఈ గడ్డకు వైఎస్సార్ జిల్లాగా పేరు పెట్టడం ఎంతైనా సమంజసం. ఆయన సేవలు భావి తరాలు మననం చేసుకోవటానికి మాత్రమే గానీ రాజకీయ కోణం చూడరాదు.

– నాగమునిరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ, కడప

హైడ్రోపవర్ ప్రాజెక్ట్ భూముల పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న జేసీ అతిథిసింగ్

కొండాపురం: మండల పరిధిలోని కె.బొమ్మేపల్లె రెవెన్యూ పొలంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన భూములను జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్ పరిశీలించారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీఓ ఆతిములం సాయిశ్రీతో కలిసి కె.బొమ్మేపల్లె రెవెన్యూ పొలంలోని భూములను పరిశీలించారు. అదానీ గ్రూపు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే 1000 మెగావాట్ల హైడ్రోపవర్ ప్రాజెక్టు కోసం ఎంత భూమి అవసరం, సేకరణ తదితరాలపై పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండాపురం ఇన్‌చార్జి తహసీల్దార్ మీనా, ఆర్ఐ మహేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ సేవలు విస్తృతం చేయాలి

కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: ఆధునిక యుగంలో అన్ని రంగాల్లో డ్రోన్ సేవలు కీలకంగా మారనున్నాయని, కావున వీటిని విస్తృతం చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రంగాల్లో డ్రోన్ సేవల వినియోగం, అవశ్యకతపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల్లో డ్రోన్ పైలెట్‌గా విధులు నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఇందుకోసం అవసరమైన వివరాలకు సెల్ నంబర్ 8712644805 (జీమ్మీ వికాస్) కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమానికి ముందు డ్రోన్ల వినియోగం – ఉపయోగాలపై గరుడ, మరుత్ డ్రోన్ సంస్థల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, డ్వామా పీడీ విజయ్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాకేష్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్ కుమార్, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ, రెవెన్యూ, సర్వే ల్యాండ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

విజయవంతం చేయాలి

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభిస్తున్న గ్రామోదయం, నగరోదయం కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. కలెక్టరేట్‌లో అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఆయా మండలాల కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జీలతో గ్రామోదయం, నగరోదయం కార్యక్రమాల నిర్వహణపై ఆయన జేసీ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రతి గురువారం మండల ప్రత్యేకాధికారులు ఒక్కో గ్రామ పంచాయతీలో గ్రామోదయం, పట్టణాల్లో నగరోదయం పేరుతో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, హౌసింగ్ పీడీ జయరాజ్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, జెడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములపై జరిగిన 57 అక్రమ రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దువ్వూరు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి.మృణాళినిదేవి ముద్దనూరులో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న సమయంలో ప్రభుత్వ భూములపై 57 రిజిస్ట్రేషన్లను జరిపారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి



జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

కడప కార్పొరేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు అభిప్రాయపడ్డారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అధికార టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై చర్చించారు. పార్టీ అనుబంధ సంఘాలకు జిల్లా, నియోజకవర్గ, మండల, కడప నగర కమిటీలు ఏర్పాటు చేయాలనే విషయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేయర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీణాపాణి.. విద్యా ప్రదాయిని



ప్రొద్దుటూరులో వాసవి మాతకు సరస్వతిదేవి అలంకారం

శరన్నవరాత్రి మహోత్సవాలు అంబరాన్ని అంటగా.. భక్తులు దేవీ అలంకరణ వైభవాన్ని తిలకించి తరిస్తున్నారు. ఏడో రోజైన బుధవారం జగజ్జననికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రూపంలో దర్శనమిచ్చి అభయమిచ్చారు. రెండో మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో దసరా ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిశాలలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి సరస్వతీదేవిగా కటాక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని కనులారా దర్శించుకున్నారు. ‘జయహో జగన్మాత’ అని కీర్తించారు. ‘వీణాపాణి.. విద్యా ప్రదాయిని’ తమలో జ్ఞాన జ్యోతులు వెలిగించాలని వేడుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో భక్తుల సందడి

క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్



ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ నాగేశ్వరప్ప

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో బుధవారం బెటాలియన్ పోలీసు కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించామని బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంటు నాగేశ్వరప్ప తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అమర వీరుల త్యాగాలు మరువలేమని, వారి కుటుంబాల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.విల్సన్, ఎస్‌డీ ప్రసాద్, మహిళా వైద్యాధికారి దివ్యరాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి



మృతిచెందిన నాగేంద్ర

ముద్దనూరు : మండల పరిధిలో చింతకుంట గ్రామ సమీపంలో నాగేంద్ర (22) అనే యువకుడు రైలు కిందపడి బుధవారం మృతి చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజారాంరెడ్డి సమాచారం మేరకు మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన నాగేంద్ర రైలు కింద పడి మృతి చెందినట్లు గుర్తించామన్నారు. మరణానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శివాలయంలో త్రుటిలో తప్పిన అగ్ని ప్రమాదం

ప్రొద్దుటూరు కల్చరల్ : దసరా ఉత్సవాల సందర్భంగా శివాలయంలో బుధవారం సాయంత్రం సరస్వతిదేవి అమ్మవారిని కొలువుదీర్చారు. అమ్మవారి చుట్టు దూదితో సెట్టింగ్ వేశారు. ఫోక్సింగ్ లైటింగ్ వేడికి దూది అంటుకుంది. ఇది గమనించిన కమిటీ ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు వెంటనే ఆర్పివేశారు. దీంతో ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా ఆలయంలో శాంతి హోమం చేసి సంప్రోక్షణ చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం కూడా మళ్లీ సంప్రోక్షణ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డిగ్రీ వరకు చదివి.. వ్యసనాలకు బానిసగా మారి..

- దొంగతనాలకు పాల్పడిన యువకుడి అరెస్ట్
- రూ. 6.5 లక్షల విలువైన 135 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్. రమాకాంత్ వెల్లడి



నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్. రమాకాంత్

కడప అర్బన్ : డిగ్రీ వరకు చదువుకున్నాడు. వ్యసనాలకు బానిసగా మారి పగలు, రాత్రి పూటల్లో దొంగతనాలకు పాల్పడుతూ 14 కేసుల్లో ఇప్పటికే నిందితుడిగా ఉన్న కడప నగరం మోచంపేట చిలకలబావి ప్రాంతానికి చెందిన షేక్ అక్బర్ అలీ అనే దొంగను అరెస్టు చేశారు. ఇతని వద్ద నుంచి ఇటీవల చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో రెండు దొంగతనాలలో దోచుకున్న రూ. 6.5 లక్షల విలువైన 135 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. ఈ సంఘటనపై కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్. రమాకాంత్ బుధవారం కడప డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

షేక్ అక్బర్ అలీ డిగ్రీ వరకు చదువుకుని ఎలక్ట్రీషియన్ వృత్తి చేసుకునే వాడు. ఈ నేపథ్యంలో చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. ఈనెల 5వ తేదీన ఎన్జీఓ కాలనీలోని స్వరాజ్యలక్ష్మి అనే మహిళ ఇంటిలోకి ఎవరూ లేనప్పుడు తాళం పగులగొట్టి లోపలికి వెళ్లాడు. ఇంటిలో ఉండిన సుమారు 83 గ్రాముల రూ.4.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దొంగిలించుకుని పోయాడు. అలాగే 7వ తేదీన ఎన్జీఓ కాలనీలోనే ఓ ఇంటి పై అంతస్తుకు వెళ్లాడు. వృద్ధురాలు ఒంటరిగా ఉండటం గమనించి ఆమెతో అద్దెకు ఇల్లు కావాలని మాటల్లో పెట్టి ఆమె నీళ్లు తెచ్చి ఇచ్చేలోపు ఆమె తలగడ కింద ఓ కవర్‌లో దాచి ఉంచుకున్న 52 గ్రాముల బరువున్న రూ. 2.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లాడు. ఈ రెండు కేసులలో నిందితుడైన షేక్ అక్బర్ అలీని ఈనెల 8వ తేదీన సాయంత్రం చిన్నచౌక్ సీఐ తేజమూర్తి, ఎస్ఐ పి. రవికుమార్ తమ సిబ్బందితో కలిసి బైపాస్ రోడ్డులో అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 6.5 లక్షల విలువైన 135 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై గతంలో 14 కేసులున్నాయని, ఈ రెండు కేసులతో కలిపి 16 దొంగతనాల కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుడిని అరెస్టు చేయడంలో కృషి చేసిన చిన్నచౌక్ సీఐ ఎస్. తేజమూర్తి, సీసీఎస్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ రవికుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఎన్. వేణుగోపాల్, సి. శివకుమార్, కానిస్టేబుళ్లు ఖాదర్‌హుస్సేన్, ఓబులేసు, రంతుబాషా, సుధాకర్, నాగరాజు, గోపాల్, ఉమామహేశ్వర్‌లను డీఎస్పీ అభినందించారు.

ఆవేదనతోనే ఆది విమర్శలు

టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి



జమ్మలమడుగు : నియోజకవర్గ అభివృద్ధి కోసం పనులు చేసేవారిని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విమర్శించారనే ఆవేదనతోనే తన చిన్నాన్న, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆవేశంతో, బాధతో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులపై మాట్లాడారని.. వ్యక్తిగతమైన విమర్శలు కావని టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చిన్నాన్న ఆదినారాయణరెడ్డిని విమర్శించే హక్కు రామసుబ్బారెడ్డికి లేదన్నారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, అలాంటి సమయంలో ప్రతిపక్ష పార్టీలు సూచనలు సలహాలు ఇవ్వకుండా ప్రతి దానికి విమర్శలు చేయడం పద్ధతి కాదన్నారు. తమకు వైఎస్ కుటుంబానికి అభినాభావ సంబంధం ఉందని, ఇప్పటికీ తమ ఊరు దేవగుడిలో వైఎస్ విగ్రహం ఉందన్నారు. అయితే జగన్ మోహన్‌రెడ్డితో సరిపోక వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు వచ్చేశామని, ఇప్పుడు తాము వైఎస్ బొమ్మలేకుండానే గెలిచామన్నారు. టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నాయకులు నియోజకవర్గ అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇచ్చి నిర్ణయాత్మక పాత్రను పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో జంబాపురం రమణారెడ్డి, గోనాపురుషోత్తం, నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల కడుపులు కొట్టొద్దు

ఏపీ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ విన్నపం



మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ ఇషాక్ అహ్మద్ హుస్సేన్

కడప రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వలంటీర్ల కడుపులు కొట్టకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏపీ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ ఇషాక్ అహ్మద్‌హుస్సేన్ అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, ఒకరికి నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే చంద్రబాబు ఇప్పటి వరకు ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. తమకు గత నాలుగు నెలలుగా గౌరవ వేతనం అందకపోవడంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి తక్షణం వలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు వెంకటసుబ్బయ్య, బాలగంగయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు తగవు



విలేకరులతో మాట్లాడుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు

కడప కార్పొరేషన్ : సచివాలయ ఉద్యోగులపై విజయనగరం కమిషనర్ నల్లనయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్, గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్, అసోసియేషన్లు సంయుక్తంగా ఖండించాయి. బుధవారం కడప నగరంలోని వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులను హిజ్రాలతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలు సచివాలయ ఉద్యోగులను కలచివేశాయన్నారు. ర్యాంకులు, టార్గెట్ల పేరుతో సచివాలయ ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొందరపాటులో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల ఫెడరేషన్ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు హీరామియా, వాట్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ అధ్యక్షుడు వరప్రసాద్, వార్డ్ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సెక్రటరీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సాగర్, పాలగిరి బాబు, సురేష్ బాబు, వెంకటేష్, చంద్రశేఖర్, కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్ల యజమానులకు అండగా నిలిచిన ఎస్పీ

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కార్ల అద్దెకు సంబంధించిన చీటింగ్ కేసులో 25 మంది యజమానులకు చెందిన 37 కార్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలను తీసుకున్నారు. కేసుల్లో ఉన్న కార్ల యజమానులు కోర్టుకు వెళ్లి సీజ్ చేయబడిన వాహనాలను విడుదల చేయించుకోవాలని నిబంధనలున్నాయి. కాగా, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుకు సీఐ జి. వెంకటేశ్వర్లు కార్ల యజమానుల తరఫున విన్నవించారు. దీంతో స్పందించిన ఎస్పీ కార్ల యజమానుల నుంచి అండర్ టేకింగ్ తీసుకుని విడుదల చేయాలని సూచించారు. దీంతో కార్ల యజమానులు జిల్లా ఎస్పీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అయితే కార్ల యజమానులు కేసు పరిష్కారమయ్యేవరకు తమ పరిధిలోనే వాటిని పెట్టుకోవాల్సి ఉంటుంది.

కడప తాలూకా హెడ్ కానిస్టేబుల్‌పై కేసు

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వి.ఎం బాషా, మరో ఇద్దరు బొమ్మిశెట్టి రామకృష్ణ, రామాంజనేయ రెడ్డిలతో కలిసి తనకు సంబంధించిన ఆస్తి వ్యవహారంలో తనను మోసం చేశారని, బెదిరించారని గతంలో కడప శాస్త్రినగర్‌కు చెందిన బందా శివకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు నకిలీ డాక్యుమెంట్లతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారని, ఒక వ్యక్తి స్థానంలో మరో వ్యక్తిని చేర్చి రిజిస్ట్రేషన్‌లను చేయించి తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాథమికంగా విచారించిన కడప తాలూకా పోలీసులు ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి. వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా వి.ఎం బాషాపై గతంలో మూడు ఎర్రచందనం కేసులతో పాటు, ఈ ఏడాదిలో కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో భూకబ్జా కేసు ఉన్నట్లు పోలీసు రికార్డుల ద్వారా తెలుస్తోంది.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు, లారీలు

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, లారీని సీజ్ చేసినట్లు సీఐ సురేష్ రెడ్డి తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. పాపాఘ్ని నదిలో రెండు ట్రాక్టర్లు, ఒక లారీ అక్రమంగా ఇసుకను నింపుకుంటుండగా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సౌత్ ఇండియా అథ్లెటిక్స్ మీట్‌కు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప స్పోర్ట్స్ : ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సౌత్ ఇండియా అథ్లెటిక్స్ మీట్–2024కు కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించిన ఏపీ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో కళాశాలకు చెందిన నలుగురు క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించడంతో పాటు సౌత్ ఇండియా అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికయ్యారు. కళాశాలకు చెందిన ద్వితీయ బీబీఏ విద్యార్థి కె. మహేష్ హైజంప్‌లో స్వర్ణపతకం, డెకాథ్లాన్‌లో రజత పతకం సాధించాడు. ద్వితీయ బీఏ (తెలుగు) విద్యార్థి ఎం. లోకేశ్వరరావు 800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజతం సాధించాడు. ద్వితీయ బీకాం విద్యార్థిని ఎం. చెన్నమ్మ 4×400 మీటర్ల రిలే పరుగులో రజత పతకం సాధించింది. పతకాలు సాధించిన కళాశాల క్రీడాకారులను ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్ అభినందించారు. ఉత్తమ ఫలితాలు తీసుకురావడంలో కృషిచేసిన ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టి. హజరతయ్యను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్. సుందరేశ్వరరావు, డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ బి. సుధాకర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పెన్నాలో నీట మునిగి యువకుడి గల్లంతు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని పెన్నానది లోలెవల్ కాజ్‌వే వద్ద బుధవారం మధ్యాహ్నం కడప బీడీ కాలనీకి చెందిన జేమ్స్(28) నీటిలో మునిగి గల్లంతయ్యాడు. కడపకు చెందిన నలుగురు కూలి పనులు చేసుకునే వ్యక్తులు బుధవారం సిద్దవటంలోని లోలెవల్ కాజ్ వే వద్ద పెన్నానదిలోకి వచ్చారు. ముగ్గురు బయట ఉండగా జేమ్స్ అనే యువకుడు ప్యాంట్, షర్టు, చెప్పులు ఒడ్డుపైనే వదిలేసి పెన్నా నీటిలోకి దిగాడు. నీరు లోతుగా ఉండటంతో మునిగిపోయాడని అతనితో పాటు వచ్చిన వారు తెలిపారు. సమాచారాన్ని వారు జేమ్స్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపారు. కుటుంబీకులు సిద్దవటం పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పెన్నానది వద్దకు చేరుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అప్పటికే చీకటి పడటంతో జేమ్స్ జాడ కనిపించలేదు. సీఐ కృష్ణంరాజు నాయక్ మాట్లాడుతూ ఈతగాళ్లతో పెన్నానీటిలో గాలింపు చర్యలు చేపడతామన్నారు. జేమ్స్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు.


జాతీయ స్థాయి ఖోఖో జట్టుకు ఎంపిక



రాముడు

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న రాముడు అనే విద్యార్థి జాతీయ స్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుధాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గూడూరులోని ఎన్‌బీకేఆర్ఐఎస్‌టీలో నిర్వహించిన జాతీయ సౌత్ జోన్ విశ్వవిద్యాలయ క్రీడల జట్టు ఎంపికలో జే ఎన్‌టీయూ ఏ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ క్రీడాకారుడిని అన్నమాచార్య కళాశాల విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎ.రాజేష్ తదితరులు అభినందించారు.

పిడుగు పాటుకు గేదె మృతి



పిడుగు పాటుకు గురై మృతి చెందిన గేదె

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తసంగటిపల్లె గ్రామ పంచాయితీలోని రేపల్లె గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగు పాటుకు గేదె మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. రేపల్లెకు చెందిన పంగా రేవతికి చెందిన గేదెను ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో కట్టేయగా సాయంత్రం వర్షంతో పాటు ఒక్కసారిగా పిడుగు పడడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. పది రోజుల క్రితం పాల కోసం రూ.50వేలు పెట్టి కొనుగోలు చేశానని బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని ఆమె కోరుతోంది.

బాలసదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం అక్కాయపల్లెలో ఉన్న బాలసదన్‌లో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫకృద్దీన్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాలల సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం–2015 గురించి వివరించారు. విద్యార్థినుల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థిని లావణ్యను అభినందిస్తున్న కళాశాల కో డైరెక్టర్ శైలూషా

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని పి.లావణ్య జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. నెల్లూరు ఎన్‌బీకేఆర్ఐఎస్‌టీ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి సౌత్‌జోన్ యూనివర్సిటీ ఖోఖో ఎంపికలలో ఆమె ప్రతిభ చాటి జేఎన్‌టీయూఏ జట్టుకు ఎంపికైంది. ప్రిన్సిపల్ రామసుబ్బమ్మ, కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూషా, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

కిలో గంజాయి స్వాధీనం

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని అప్పారాజుపేట వద్ద బుధవారం గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మనోజ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.